# సినిమా న్యూస్

## వెంకీ కొత్త అవతారం




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం- ఏకే47' టీజర్ నెట్టింట తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఒక స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రానికి 'ఏకే 47' అనే గన్ పేరును టైటిల్‌గా జోడించడం ద్వారా.. సినిమాలో త్రివిక్రమ్ మార్క్ మ్యాజిక్ ఏ స్థాయిలో ఉండబోతోందో ఈ టీజర్ స్పష్టం చేసింది. మధ్యతరగతి ఇళ్లలో జరిగే సరదా సంఘటనలతో మొదలైన ఈ గ్లింప్స్.. వెంకీ వింటేజ్ కామెడీ టైమింగ్, త్రివిక్రమ్ పదునైన పంచ్ డైలాగ్స్, ఊహించని ఎనర్జిటిక్ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. వెంకటేష్ తనదైన శైలిలో నవ్విస్తూనే యాక్షన్ ఎలిమెంట్స్‌తో థ్రిల్ చేశారు. పైకి ఆదర్శ కుటుంబంగా కనిపిస్తూనే, ఆ ఫ్యామిలీ దాచిన అసలు కథ ఏంటనే ఉత్సుకతను టీజర్ అద్భుతంగా రేకెత్తించింది. వెంకటేష్ సరసన కేజీఎఫ్ బ్యూటీ శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోంది.

నారా రోహిత్, నివేదా పేతురాజ్, సత్య, రావు రమేష్, బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్, రఘుబాబు లాంటి భారీ కాస్టింగ్ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చింది. థమన్ ఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్ ఎలివేషన్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. రవి కె. చంద్రన్ విజువల్స్, నవీన్ నూలి ఎడిటింగ్, ఏ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ సినిమా స్థాయిని చాటిచెబుతున్నాయి. త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఎన్నో బ్లాక్ బస్టర్స్ తెరకెక్కించిన హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం బాధ్యతలను త్రివిక్రమ్ శ్రీనివాస్ స్వయంగా భుజాన వేసుకుని చెక్కిన ఈ అచ్చమైన తెలుగు సినిమా అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. వినోదానికి యాక్షన్ జోడించి బాక్సాఫీస్ వద్ద దద్దరిల్లే రేంజ్ హిట్టు కొట్టేందుకు వెంకీ-త్రివిక్రమ్ సిద్ధమయ్యారు.


## సంక్రాంతి బరిలో మామ-అల్లుడు!



మెగా హీరో సాయిదుర్గా తేజ్, టాలెంటెడ్ డైరెక్టర్ రోహిత్ కేపీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటిగట్టు'. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే, సరిగ్గా అదే సమయంలో జనవరి 13న మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మూవీ 'కాకా' కూడా రిలీజ్ కానుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో బాక్సాఫీస్ వద్ద మామ అల్లుళ్ల మధ్య పోటీ ఖాయమని, లేదా 'సంబరాల ఏటిగట్టు' వెనక్కి తగ్గుతుందని ప్రచారం జరిగింది. ఈ ఊహాగానాలన్నింటికీ మేకర్స్ తాజాగా ఫుల్‌స్టాప్ పెట్టారు. తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ, ఈ సినిమా డబ్బింగ్ పనులను అధికారికంగా ప్రారంభించారు. స్టూడియోలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ అప్‌డేట్‌తో పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరినట్లు స్పష్టమైంది. అనుకున్న తేదీకంటే ముందుగానే షూటింగ్ పనులు పూర్తి చేసి.. జనవరి 12న కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు చిత్రబృందం ప్రయత్నాలు చేస్తోంది. ఒక రోజు గ్యాప్‌తో ఇద్దరు మెగా హీరోలు బాక్సాఫీస్ వద్ద తలపడబోతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.

## స్వయంభు రిలీజ్ డేట్‌కు ముహూర్తం!

నిఖిల్ సిద్ధార్థ కథానాయకుడిగా నటిస్తున్న ప్యాన్-ఇండియా చిత్రం 'స్వయంభు'. ఈ సినిమా అనౌన్స్ చేసి చాలా కాలం అవుతున్నప్పటికీ, సరిగ్గా అప్డేట్స్ రాకపోవడం, విడుదల తేదీని ప్రకటించకపోవడంతో అనేక ఊహాగాణాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా నిఖిల్ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా.. సూపర్ అప్డేట్ ఇచ్చాడు. "స్వయంభు' దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోయే ఒక బహుభాషా పాన్-ఇండియన్ చిత్రం. మంచి విషయాలు జరగడానికి సమయం పడుతుంది. ఆ సమయం దాదాపు ఆసన్నమైంది... ఒకే సినిమా కోసం 175 రోజుల పాటు షూటింగ్ జరపడం, 2500 గ్రాఫిక్స్ షాట్స్ ఉండటం అనేది నేను ఎప్పుడూ ఊహించలేదు. కానీ.. దుమ్మురేపడానికి సిద్ధంగా ఉన్నాం.. విడుదల తేదీ ప్రకటన త్వరలోనే రానుంది' అంటూ ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశాడు. దీంతో ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. భారీ పీరియాడిక్ యాక్షన్, అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించగా.. సంయుక్త మీనన్, నభా నటేష్, సునీల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్, ఎక్లిప్స్ క్రియేషన్స్ బ్యానర్లపై భువన్ సాగర్, శ్రీకర్, ఠాగూర్ మధు నిర్మిస్తున్నారు.



## 'స్పిరిట్'పై ప్రణయ్ రెడ్డి సవాల్!

స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో వేణు గోపాల్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రోమాంచకం'. ఈ చిత్రాన్ని భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించారు. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటించిన ఈ సినిమా సెప్టెంబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి సంబంధించి సోషల్ మీడియాలో పాజిటివ్ టాక్‌తో పాటు తీవ్ర విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా సినిమా రివ్యూలు, వాటి వెనుక ఉన్న కష్టాలపై స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రివ్యూలతో సినిమాల స్థాయిని ఎప్పటికీ తగ్గించలేరని ప్రణయ్ రెడ్డి తేల్చిచెప్పారు. సినిమా నిర్మాణ రంగంలో ఉన్నవారికే ఆ కష్టాలు, సవాళ్లు ఏంటో పూర్తిగా అర్థమవుతాయని అన్నారు. రచయిత రాసిన కథను తెరపైకి తీసుకురావడానికి దర్శకుడు ఎంత కష్టపడతాడో, షూటింగ్ సమయంలో ఏయే ఇబ్బందులు తలెత్తుతాయో సాధారణ ప్రేక్షకులకు లేదా విమర్శకులకు పూర్తిగా తెలియదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా 'రోమాంచకం' సినిమా రివ్యూల విషయంలో కొందరు చాలా చిన్న విషయాలను భూతద్దంలో పెట్టి విమర్శించారని ఆయన మండిపడ్డారు. ఆ విధంగా సినిమాను విమర్శించేవారికి ఆయన ఒక బహిరంగ సవాల్ విసిరారు. వారికి నిజంగా అంత సత్తా, సామర్థ్యం ఉంటే.. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్‌తో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'స్పిరిట్' స్థాయిని తగ్గించగలరా? అని సవాల్ చేశారు. కాగా, ప్రభాస్, త్రిప్తి డిమ్రి జంటగా నటిస్తున్న 'స్పిరిట్' సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.



## 'జైలర్ 2' సెన్సార్ రగడ




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న అత్యంత క్రేజీ సీక్వెల్ 'జైలర్ 2'. సన్ పిచర్స్ పై కళానిధి మారన్ నిర్మిస్తున్నఈ భారీ బడ్జెట్ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన సాంగ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. రిలీజ్ కు దసరా కానుకగా రిలీజ్ కాబోతున్న ఈ సినిమా గురించి తమిళ ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికర వార్త హల్‌చల్ చేస్తోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తయ్యిందని, అయితే సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'ఏ' (అడల్ట్స్ ఓన్లీ) సర్టిఫికెట్ జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రజనీకాంత్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రానికి 'యు/ఏ' సర్టిఫికెట్ లభిస్తేనే థియేటర్లలో విడుదల చేయాలని, లేకపోతే సినిమా విడుదలను నిలిపివేయాలని రజనీకాంత్ స్పష్టంగా చిత్ర బృందానికి తేల్చి చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. 'ఏ' సర్టిఫికెట్ వస్తే కుటుంబ ప్రేక్షకులు, పిల్లలు థియేటర్లకు రావడానికి ఇబ్బంది పడతారని అది సినిమా కలెక్షన్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని రజనీ భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సెన్సార్ సర్టిఫికెట్ వివాదంపై చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్, సెన్సార్ బోర్డు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇకపోతే అన్ని అంచనాల నడుమ ఈ చిత్రాన్ని అక్టోబర్ 15, 2026న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి నిర్మాతలు అధికారికంగా తేదీని ఖరారు చేశారు.